క థా ని క

# “ప్రాలబ్ధం”

వేకుమళ్ల కామేశ్వరరావు

పొద్దున్న సత్తుతప్పేలా పట్టుకొని మజ్జిగకు వచ్చిన బాపనమ్మ, సావిటిలో ఏడుస్తూన్న చంటిపిల్లవాణ్ణి చూసి, ఆశ్చర్యపోతూ సూర్యకాంతంతో “వీణ్ణి ఏసంతలో కొనుక్కొ వచ్చేవమ్మా వదినా” అని బుగ్గనివేళ్లు వేసుకొంది.

పిల్లవాడికి నీళ్లుపోసి ఒళ్లుతుడుస్తూ సూర్యకాంతం “ఊరుకో బాబూ! ఊరుకోరా నా అబ్బీ!” అని బుజ్జగిస్తూ, బాపనమ్మతో, “ఈ మధ్య వారం రోజులుపాటు ఊళ్లో లేకుండా చేసిన ఘనకార్య మేమిటనుకొన్నావు? వీణ్ణి మచ్చికచేసి తీసుకురావడానికే తీర్థయాత్ర చేశాం” అంది.

బాపనమ్మ ఆశ్చర్యపోతూ “పిల్లవాడు ఎర్రగా తొగరుదారం లాగున్నాడమ్మా వదినా! కన్ను, ముక్కు తీరుగానే ఉన్నాయి. పోనుపోను వాడే అతుక్కు పోతాడులే!” అంది.

“ఏమో! ఎన్నడూ నిద్రకికాచి ఎరగను తల్లీ! నిన్నరాత్రి ఒక్కమాటు కన్ను ఇలాగు మలపలేదంటే నమ్ము. ఆయనకీ నాకూ కూడ ఒక్కటేపోరు, అదేం శత్రుత్వమో గాని!”

“సరి! పిల్లలతో సుఖమంటే మరేమిటనుకొన్నావు. అదేసుఖం.”

“సుఖం కాదు. నాయెదం”

“ఇప్పుడు వాళ్లతో అవస్థలు పడితేనే తర్వాత మనని సుఖపెడతారు”

“ఈ అవస్థలన్నీ గడిచి మేము బతికుంటే అప్పుడు చూసుకొందాంలే” అంది సూర్యకాంతం.

“డబ్బు, దసకం ఏమేనా ఖర్చయిందా?” అని చల్లగా అడిగింది బాపనమ్మ.

“ఇంకా ఏదమ్మా బాపనమ్మ వదినా! దత్తత చేసుకొన్నప్పుడు కదా సువర్ణదానం చేసుకొని పుత్రదానం పుచ్చుకోడం. ఇప్పుడంతా ముందుకొస్త అలవాటు చేసుకోడానికి మాత్రమే!” అంది సూర్యకాంతం. ఆమె ఇన్ని మజ్జిగనీళ్లు పొయ్యగా బాపనమ్మ వెళ్లిపోయింది.

రాఘవయ్య ఇంటికి వచ్చేడు. వచ్చీ రావడంతో “కుర్రాడు ఏడుస్తున్నాడేమే!” అని ప్రశ్నించేడు.

“ఏమో! ఇప్పుడే నీళ్లుపోసి తుడిచాను పాలు పోశాను” అంది సూర్యకాంతం.

రాఘవయ్య బజారునుంచి పసివాడి నిమిత్తం చిన్న గిన్నెలు, ఒక చెంచా, పాలడబ్బా, బిస్కట్లు, పెప్పరమెంట్లు, ఆట వస్తువులు తీసుకువచ్చేడు. ఆట వస్తువులు రెండు పిల్లవాడికి అందియ్యపోగా, వాడికి ఏడుపు తప్ప మరొకటి అవసరం లేకపోయింది.

“ఇంకా తల్లి భ్రమ వదలలేదేమోనండి పాపం! మనకెంత పాపం వస్తుందో ఏమిటో తల్లిని పిల్లను ఎడబాపులు చేసినందుకు!” అని ధర్మపన్నాలు పలికింది ఇల్లాలు.

“తల్లి భ్రమ తండ్రి భ్రమ మనిషికి ఎప్పటికి వదులుతాయి. ఇప్పుడుసహా నువ్వు నీ పుట్టింటికి పోతానంటూంటావు కదా. లేతప్పుడు వదలక పోతే ముదిరేక వదులుతుందా? మొక్కప్పుడు వంగనిది మానయ్యేక వంగుతుందా? క్రమక్రమంగా అదే అలవాటు అయిపోతుంది.” అన్నాడు రాఘవయ్య.

రెండు రోజులు గడిచాయి. తెల్లవారగట్ల రాఘవయ్య ఇంకా నిద్రపోతున్నాడు. సూర్యకాంతం మేలుకొని “రాత్రి కోడికి నాకు ఒక్కలాగు తెల్లవారింది. రాత్రుళ్లు నిద్రలు లేవు, పగలు తీరుబాటు లేదు. ఆయన మరీను! అదేమిటోగాని “పిల్లాడో! పిల్లాడో!” అని ఏకమైపోతున్నారు. ఆ ముచ్చటా తీరుతూంది పాపం! సుఖాన ఉన్న ప్రాణం దుఃఖాన వేసుకోడమయింది. నిద్రలేని మొహాలు కనబడుతూనే ఉన్నాయి. ఎందుకువచ్చిన ప్రాలబ్ధమిది! కనుక్కుంటే తప్పదుకాని లేనిపోని తద్దినమెందుకు! సరిగా నిద్రపట్టే టైముకి

బాగా ఎత్తుతాడు, వాడి సొమ్మేమిపోయిందో. పగలల్లా రాజులాగు నిద్రపోతాడు. రాత్రి పగబట్టి మా పని పట్టిస్తాడు. ఇది ఎందుకువచ్చిన ఖర్మం, కలిగినదేదో తిని పడుండక! కావలిస్తే ఆయన మెడకి కట్టుకొని ఊరేగమను" అని విసుగుకొంది.

రాఘువయ్య లేచాడు. క్రమంగా పనులన్నీ చేసుకొని పిల్లవాణ్ణి చంకను పెట్టుకొని, ఒక మారు ఇంటిలో ఇటు అటు పచారు చేసి "అర్జంటు పని ఉంద"ంటూ వీధిలోకి వెళ్ళిపోయి పదకొండింటింకి తిరిగివచ్చేడు.

సిద్ధాంతి అంటే కుర్రవాడి జనక తండ్రి దగ్గిరనుంచి ఉత్తరం వచ్చింది. రాఘువయ్య దానిని విప్పి చదివి సూర్యకాంతంతో కోకిలమ్మకి అంటే కుర్రవాడి తల్లికి చంటివాడు ఇంటిలో లేకపోగా ఏదో పిచ్చెత్తినట్టుగా ఉందనీ, రాత్రిళ్లు ఏవేవో పీడకలలు వస్తున్నాయనీ, అందుచేత తక్షణం కుర్రవాణ్ణి ఒక్కమాటు తల్లికి కనబరిచి, మళ్ళీ తీసుకువెళ్ళమనీ సిద్ధాంతి రాసేడు" అని చెప్పి "మనం ఇవాళే బయలుదేరి ఒకమాటు వెళ్ళితే మంచిది" అన్నాడు.

ప్రస్తుతం కొంత పీడ వదులుతుందికదా అని సూర్యకాంతంకూడ ఒప్పుకొంది.

భార్యాభర్తలిద్దరూ కుర్రవాణ్ణి జనక తండ్రి ఇంటికి తీసుకువెళ్ళి అక్కడ తాముకూడ నాలుగురోజులుండి కుర్రవాణ్ణి జనకతల్లి చంకలోంచి ఊడ లాగుకొని వచ్చేరు.

సూర్యకాంతానికి పిల్లవాడంటే ముచ్చటే కాని వాడితో పడే అవస్థలు చూస్తే ఆమెకు బతుకుమీదే విరక్తి పుడుతూంది.

హఠాత్తుగా ఒకరోజున సిద్ధాంతి, కోకిలమ్మ తమ పిల్లజెల్లాతోకూడ రాఘువయ్య ఇంటికి చక్కా వచ్చేరు. ఇంటికి రాగానే పిల్లవాణ్ణి చూసి తల్లి, తల్లినిచూసి పిల్లవాడు కౌగలించుకొని ఒక్కటే ఏడుపు! ఒక పట్టానిగాని వాళ్లు విడలేదు.

సిద్ధాంతి కోకిలమ్మ ధ్యానం ఎంతసేపూ పిల్లవాడిమీదే ఉందనీ, మనిషి పిచ్చెత్తిపోయేట్టు ఉండగా ఇక లాభంలేదని తీసుకువచ్చేవనీ అన్నాడు.

రాఘువయ్య, సూర్యకాంతం కూడ విని ఊరుకొన్నారు.

అందరూ కొన్నిరోజులపాటు ఇక్కడే గడిపేరు. తిరిగి ఊరికి వెళ్లేటప్పుడు సిద్ధాంతి "పిల్లవాణ్ణికూడ మాతో ఒకమాటు తీసుకువెళతాం, మళ్ళీ పంపుతాం" అని బతిమాలుకొన్నారు.

వాళ్ళపిల్లవాణ్ణి వాళ్లకియ్యడం కూడ అబ్బురమేనా అనుకొని, తనమనుకోరం కొద్దీ "మనం ఈమోస్తరుగా అభిమానం పెట్టుకొంటే చంటిపిల్లవాడు తల్లిని మరచి ఎప్పటికేనా మాలో మనిషి అవుతాడా?" అని రాఘువయ్య స్పష్టంగా అడిగేడు.

"ఇంకా చంటిపిల్లాడు కాదండీ!" అంది కోకిలమ్మ, పిల్లవాణ్ణి రొమ్ముకు నొక్కుకొంటూ.

"లేత వయస్సులోనే బుద్ధిమారాలి. వయసు ముదిరితే వాడు ఇంకొకచోట కుదురుకొంటాడా?" అన్నాడు రాఘువయ్య.

"ఈ మాటుకి ఇలాగు కానిద్దురూ!" అన్నాడు సిద్ధాంతి.

మొత్తంమీద ఆ దంపతులను మెత్త పరిచి పిల్లవాణ్ణి తమ ఇంటికి తీసుకుపోయేరు.

ఊళ్ళో ఎక్కడ చూసినా మశూచికం ప్రబలంగా ఉంది. ఆరోగ్యశాఖవారు తాము చెయ్యగలిగినదంతా చేస్తున్నారు. కాని జాడ్యం లొంగకుండా ఉంది. మొదటిలో ఒకటిరెండు చావులుగా బయలుదేరి క్రమంగా సంఖ్య పెరిగింది. చంటిపిల్లవాడికి కూడ మశూచికం కనిపించింది. రోజులు గడిచినకొద్దీ తల్లిదండ్రులకు బెంగతోపాటు ఆశకూడ అధికమయింది. "వచ్చిన అమ్మవారు సవ్యంగా దిగజారక కొళ్ల దగ్గిర మొదలు పెట్టింది" అని డాక్టరు అనుమానం సూచించాడు. అఖరికి అనుకున్నంత పనీ అయింది. తల్లిదండ్రుల గోలకి హద్దులేక పోయింది. రాఘువయ్యపేర సిద్ధాంతి తంతి నిచ్చాడు. రాఘువయ్య, సూర్యకాంతం కూడ తక్షణం కొట్టుకువచ్చి, జరిగిన సంఘటన తెలుసుకొని నెత్తి నోరు బాదుకున్నారు.

"మీదగ్గిరేనా ఉండనిచ్చాం కాదు పిల్లాణ్ణి" అని సిద్ధాంతి గుండె బాదుకొన్నాడు.